**వెంకటేసుకూ, వానాకాలానికి చుక్కెదురు, వానాకాలమొస్తే వెంకటేసు వృత్తి సరిగ్గా కొనసాగదు. ఒక్కొక్కప్పుడు అరగడుపు-**

పరగడుపుతోనే పడుకోవలసి వస్తుంది.

పుట్టి బుద్ధి తెలిసినప్పటినుంచీ ఎన్నో వానాకాలాలు చూశాడు వెంకటేసు. కానీ నిరుడు వానాకాలం లాంటిది మాత్రం చూసి ఎరుగడు. పులిమీద పుట్రలాగా అవి ముత్యాలు నీళ్ళాడిన రోజులు. తొలిచూలు ఆడబిడ్డ—లక్షిందేవిలా వుంది. కానుపుచేసి వెళ్ళడానికి వచ్చిన సుబ్బులత్త చీటికీమాటికీ ఏదో ఒక వస్తువు కావాలని చెబుతూవుండడంతో వెంకటేసు దగ్గరవుండిన నిలవ పాతిక రూపాయలూ కానుపు ఖర్చులక్రింద చెల్లిపోయాయి. గొడ్డలి భుజానమోపి అతడు అడివి ముఖం చూసి పదిహేను రోజులైంది. నూకలకోసం వెళ్ళినప్పుడల్లా కోమటి రంగన్న 'ఈ వేళగూడా అప్పేనా' అని కసిరి కొడుతున్నాడు. నెల రోజుల పొడుగునా చిత్తడి వానలు కురిసి, వున్నట్టుండి జడి వానలే ముమ్మరించుకున్నాయి. ఏకాలవ చూసినా హోరు హోరున పరుగెత్తడమే. ఏ కయ్య చూసినా జానెడులోతు నీళ్ళే. అడుగు తీసి అడుగువేస్తే చీలమండలదాకా బురద. ఈసురోమంటూ ఈదరగాలి...

కాయకష్టం చేస్తేగాని పూట గడవని జనం పాలిటికి అది వానలాగా కనిపించడం లేదు, కడగండ్ల వానలాగే కనిపిస్తోంది.

అలాంటి చిత్తడి రోజుల్లో ఒకనాటి సాయంకాలం ఎలాగైనా డబ్బుపుట్టించాలన్న తీవ్ర ప్రయత్నంతో వెంకటేసు గుడిసెలో నుంచి ఈవలకి వచ్చాడు.

మోకాళ్ళదాకా పంచ పైకెగగట్టి, పై తువ్వాలు చెవుల కడ్డంగా చుట్టుకొని ఆచి, తూచి అడుగులువేస్తూ బజారుదాకా వచ్చేశాడు వెంకటేసు. ఆ వూరికి బజారయినా అదే, రాచబాటయినా అదే. అది తిరుపతి నుంచి మదనపల్లి వెళ్ళే తారురోడ్డు, ఊరికి ముందర ఉత్తర దక్షిణాలుగా ప్రవహించే చింతలేరు. తూరుపునుంచీ వచ్చే రోడ్డు ఏటవాలుగా చింతలేటిలోకి దిగి, ఏటికడ్డంగా మూరెడెత్తున ప్లాట్‌ఫారంలా కట్టిన సిమెంటు చప్టామీద పరుగెట్టి మళ్ళీ ఊరి మధ్యలో నుంచీ పడమటి దిక్కుగా వెళ్తుంది. అయితే యిప్పుడీ రోడ్డుపైన రాకపోకలు లేవు...

వారం రోజులుగా చింతలేరు చేస్తున్న రభస చెప్పతరం కాదు...

''పొంగుతగ్గినట్టుందే !''—ఎవరో అంటున్నారు.

''పరవాలేదు. రేపీపాటికి బాగా తగ్గిపోయేటట్టుంది''—మరెవరో చెబుతున్నారు.

రోడ్డువాలువెంట ఏటి కభిముఖంగా నడవసాగాడు వెంకటేసు.

వీధులపైన జనసంచారపు రద్దీ కానరావడంలేదు. బేరసారాల కలకలం కూడా తగ్గుముఖం పట్టిందేమో అంగళ్ళు కూడా గోనెపట్టాల పరదాల వెనుక వెలవెలబోతున్నాయి. చాటునా మాటునా గువ్వలా ముడుచుకుని కూర్చున్న జనమేగానీ నిటారుగా నిల్చున్నవాళ్ళు గానీ, తిరుగుతున్నవాళ్ళు గానీ లేరు. డబ్బు పుట్టించే వెరవుకోసం ఆలోచిస్తూ బజారు చివరిదాకా వచ్చి ఏటి అంచున నిల్చుని ప్రవాహంకేసి చూడసాగాడు వెంకటేసు. ఇంతకాలంగా ఎక్కడుండిపోయిందో ఈ ఎర్రటి నీరు ! రొప్పు

కుంటూ, రోజుకుంటూ వచ్చి రోడ్డుపైన మాత్రం కాస్త నెమ్మదిగా ప్రవహిస్తోంది.

చూసినంత సేపు ప్రవాహం కేసి చూసి వెంకటేసు పక్కలకు చూపు సారించాడు. అక్కడ రోడ్డుకివలా, ఆవలా వున్న టీ కొట్లల్లో- మధ్యాహ్నానికల్లా పాలయిపోయా యేమో, బాయిలర్లు మాత్రం మండడం లేదు. కానీ చిత్రమేమిటంటే కొట్లు మాత్రం మనుషులతో క్రిక్కిరిసి వున్నాయి.

ఏనుగుపాడి సుబ్బన్న, చేమంతుల శివయ్య, మిద్దింటి వీరారెడ్డి, నూరుబావుల పోతరాజు, ఇంకా నాగప్పగారి అబ్బాయి భూషణం, రామి నాయుడుగారి రెండో అబ్బాయి శ్రీనివాసులు, బంగారక్క మనవడు చిట్టిబాబు, సీతంరాజుగారి దత్తు కొడుకు రాఘవులు...ఇలా వరుసగా కనిపిస్తున్న వారిలో తనకు సాయం చేయగలిగే ముఖం కోసం వెంకటేసు చూపులు ఆవురావురు మంటూ వెదక సాగాయి.

ఏ పెళ్ళికో, దేవరకో ఊళ్ళో పెద్దలందరూ ఇలా ఒక చోట చేరడం పరిపాటి. మరైతే ఈ మునివేళప్పుడు మూడు వైపులా బరాబయలుగా వున్న పూరిపాకల క్రింద, విసవిసలాడుతున్న చలిగాలిలో కుంచించుకపోతూ...

వెంకటేసు కింకొక విషయం స్ఫురించింది. దివిటీపెట్టి వెదికినా యిందులో ఏ ముఖంలోనూ ఉత్సాహపు వెలుగులు కానరావడంలేదు. యుద్ధంలో రాజ్యాలు పోగొట్టుకుని, ఇళ్ళకువెళ్ళి పెళ్ళాల ముఖం చూడలేక నట్టడివిలో నిట్టూర్పులు నెమరేస్తూ కూలబడిపోయినట్టు అందరివీ దిగాలుపడ్డ వాలకాలే !

ఈ స్థితిలో వాళ్ళిచ్చేదేమిటి, తాను పుచ్చుకునే దేమిటి అనుకున్నాడు వెంకటేసు.

# పనికిరాని పాఠాలు



## మధురాంతకం రాజారాం

ఎంతగా లేనివాడయినా అడిగి లేదనిపించుకుంటే తల కొట్టేసినట్టే వుంటుంది.

ఎలా వెళ్ళినవాడలాగే తిరిగిరానుంకిస్తుండగా పిలుపు వినిపించింది.

"ఒరే వెంకటేసూ! ఇలా వస్తావా?"

పిలిచినవాడు బుర్రమీసాల వీరారెడ్డి. ఒక తిక్క మళ్ళితే అడిగినవాడి ముఖాన అయిదో పదో పారేసే మారాజు. పరుగు పరుగునా కొట్టులోకి దాటేశాడు వెంకటేసు.

"వెంకటేసూ!"

"చెప్పండయ్యా!"

"చెబితే లాభమేముందిరా! చెప్పిన పని చెయ్యాలి గదా!"

"చేస్తే ఏమిస్తావో అది గూడా చెప్పాలి గదండయ్యా వీరారెడ్డీ!"... ప్రతిపాదనకు హుషారు కల్పిస్తూ అన్నాడు పోతరాజు.

"రెండ్రూపాయలిస్తాను, సరేనా!"

"చెప్పండయ్యా!" సంసిద్ధతను వ్యక్తం చేశాడు వెంకటేసు.

"ఏంలేదు. సీసా నిండుగా సరుకు పట్రావాలి."

సరుకు! వెంకటేసుకేమిటో అర్థమైంది. సరుకంటే సారా. సారాకొట్టు దగ్గర్లోనే వుంది. ఈ కొట్టులోనుంచి చూస్తే కనిపిస్తుంది. ఎటొచ్చీ చింతలేరొకటే అడ్డం. ఏడాది పొడుగునా ఇసుకతిన్నెలా పడివుండే చింతలేరిప్పుడు ఒడ్డుల్ని ఒరుసుకుంటూ పారుతోంది...

"ఏటిలో దిగ్గలవ్రా? ఈతొచ్చునా నీకు?"

వచ్చునన్నట్టుగా తలవూపాడు వెంకటేసు.

"ఇంకేం, వెళ్ళేటట్టయితే కానిచ్చేయ్! మడిగుంతలేమీ వుండవులే! నెమ్మదిగా వెళ్ళి రావాలంతే!"

"ఈమాత్రానికింతగా అడుక్కోవాలటయ్యా వీరారెడ్డీ! కోడెప్రాయంలో వున్నాడు, వాడికిదేం లెక్క, జమా?"

"వాళ్ళ నాన్నుండేవాడు, నారిగాడు - గొంతుకదాకా నీళ్ళొచ్చినా ఏటికడ్డం పడి అటూ యిటూ పట్టె కానినట్టుగా తిరిగేసేవాడు..."

"వీడు మాత్రం ఆ తండ్రి కొడుకు కాడంటయ్యా పోతరాజూ?"

"ఓరి నీ పిచ్చి దొంగల్దోలా! పులి కడుపున మేకపిల్ల పుడుతుందా?"

ఈలోగా వెంకటేసు చేతిలోకి సీసా రానే వచ్చేసింది. వీరారెడ్డి జేబులోనుంచీ అయిదు రూపాయల నోటు పైకి తీశాడు.

కాల్గంట పని! తేరకేంగాదే! రెండు రూపాయలు బక్షీసు!

వడిసెలరాయిలా రివ్వున వచ్చి ఏటిలో దిగేశాడు వెంకటేసు.

ఒక చిర్రున నీళ్ళను చీల్చుకుంటూ నట్టేటిదాకా వెళ్ళాడు. నీళ్ళు నడుములంటిదాకా వచ్చేశాయి. ఇంకెంత? ఇంకొక రెండు బారల దూరం వెళ్తే ఆ పైన కళ్ళు మూసుకున్నా వెళ్ళిపోవచ్చు. ఈ రెండు బారలూ గడిచేలోగా నీళ్ళు రొమ్ముదాకా వచ్చేశాయి. చేతులు పైకెత్తి పట్టుకుని నీళ్ళతో పోరాడినట్టుగా ముందుకు చొచ్చుకుంటూ వెళ్ళి అవతలి గట్టుపైన పడిపోయాడు.

పాకలో ఎత్తయిన అరుగుపైన సారా జాడీకి చేరువగా కూర్చున్న వజీర్సాబు మానవమాత్రుడొకడు కనిపించడంతో పరమానందభరితుడైపోయి మళ్ళీ అతడు తనకు ఖాతాదారుకానందుకు కించపడిపోతూ "ఏందిరా వెంకటేసూ! ఎక్కణ్ణించి వూడిపడినావురా? ఇంతలావు నీళ్ళొస్తుంటే

ఏటిలో ఎలా దిగినావురా?" అంటూ ఆశ్చర్యపడిపోయాడు.

తడిసి ఒంటి కంటుకపోయి నడిచినంత మేరకు నీళ్ళు ధారలుగడుతున్న బట్టలవల్ల వెంకటేసు కిప్పుడు తన శరీరమే తనకు బరువైపోయినట్టుంది. చలి తాకిడికి కడుపులోని పేగులు కూడా ఉంగలు చుట్టుకుపోతున్నాయేమో, ఆ దెబ్బకు నోటిలో పళ్ళు టైపు మెషినులా టకటకలాడుతున్నాయి. అలాగే నాలుగడుగులు ముందుకు వేసి కుడి చేతిలోని సీసా అరుగుపైన వుంచి అతడు ఎడమ చేతి చొక్కా మడుపులో నుంచీ అయిదు రూపాయల కాగితం పైకి తీశాడు.

"మిద్దింటి పెద్దాయన పంపాడులే వజీరన్నా! తొరగా ఒంచు. బిరీన ఎళ్ళిపోవాల" అన్నాడు.

సీసా నిండుకు సారా పట్టడం పూర్తి కాగానే "ఉండు, వుండుండ్రా వెంకటేసూ!" అన్నాడు వజీరు. సీసా అరుగుపైన పెట్టి ఓ సత్తు లోటాలోకి సారా పట్టుకుంటూ "చలికి పిడచగట్టుకపోయి ఎలా అఘోరిస్తావురా వెంకటేసూ! ఇంద, నా మాట విని రెండు దరాములేసుకో! పరవాలేదు. ఉల్హాగానే లే, నాకేమీ రూకలివ్వొద్దు" అన్నాడు.

వెంకటేసు ఓ అడుగు వెనక్కువేసి "అబ్బే, వద్దొద్దు వజీరన్నా! నేనెప్పుడూ దాని జోలికి పోయినోణ్ణికాదు. అదంటే నాకు భయం కూడా! ఏం చేస్తుందో ఏమిటో నీకు పుణ్ణెముంటుందిబాబూ, నేను పుచ్చుకోను" అంటూ గింజుకున్నాడు.

"ఓరినీ! ఎందిరా నువ్వు! ఏసుకోరా, ఒళ్ళు ఎచ్చగిల్లుతుందంటే!" గద్దించినట్టుగా అన్నాడు వజీరు.

ఊపిరి బిగబట్టి నిండుగా రెండు గుక్కలు మింగేశాడు వెంకటేసు. కుంకుడుకాయల రసంకన్నా యింపితంగా లేదు. ముఖం చిట్లించుకుంటూ లోటావైపు చూశాడు. సగంలోటా ఖాళీ అయిపోంది. వజీరు గనుక చూడకపోతే మిగిలిన సరుకు పారబోసేవాడే! గుడ్లగూబలా వీడొకడు దాపురించాడనుకుంటూ కళ్ళు మూసుకుని ఆ మిగిలిన గుక్కా త్రాగేశాడు.

పాకలోనుంచి ఈవలికి వచ్చిన వెంకటేసుకు తానిప్పుడొక కొత్త లోకంలోకి అడుగుపెట్టినట్టనిపించింది. ఒళ్ళు తేలికై కాళ్ళు గాలిలో తేలిపోతున్నట్టున్నాయి ఆకాశం మూడంటే మూడే బారల దూరంలో వున్నట్టుంది. అరరే, యిదేమిటో హాయిగానే వుందే! అనుకోక తప్పడంలేదు.

ఎటొచ్చీ ఈసారి ఏరుదాటడమే కొంచెం తంటాగా పరిణమించింది. నీటి కెదురుగా నిలవరించుకుని నడవడంకన్నా, ఏటికడ్డంపడి ఈతకొడదామా-అనుకున్నాడు. అంత పని చేయడానికి వీల్లేకుండా చేతిలో సీసా ఒకటి అన్నట్టింతకు మునుపు నీళ్ళు ఉత్తరంనుంచీ దక్షిణంగా పారుతున్నట్టుండిందా, యిప్పుడేమో యివి తన చుట్టూరా గిర్రున తిరుగుతున్నట్టున్నాయి. అసలు రంగుల రాట్నంలా తిరుగుతున్నవి నీళ్ళా, కళ్ళా, ఒళ్ళా? సాక్షాత్తుగా అయోమయ స్థితిలోనే అతడు యివతలి గట్టుకు చేరుకున్నాడు.

భుజం చరిచి "శబ్బాష్" వెంకటేసూ అన్నాడు వీరారెడ్డి

"ఇకనేమిరా వెంకటేసూ! ఒకసారి దాటడమే కష్టం, ఆ పని నీ చేతనైపోయింది ఇంక నువ్వు ఎన్నిసార్లయినా దాటెయొచ్చు

(మిగతా 38వ పేజీలో)

(13వ పేజీ తరువాయి)

నాకో సీసా తెచ్చి పెట్టావ్రటా! రెండుగాదు మూడ్రూపాయలిస్తాను, సరేనా?'' పాపం! పోతరాజు ప్రాణరక్షణ కోసం భంగపడినంత దీనంగా అడుగుతున్నాడు.

అదెంతపని లెమ్మన్నంత ధీమాతో వెంకటేసు సీసా చేతికి తీసుకున్నాడు.

ప్రవాహపు వురవడిని పిసరంతయినా ఖాతరు చెయ్యకుండా అతడు ఏటిలో దిగేశాడు. తాను నడుస్తున్నాడో, ఈదుతునాడో ఆతడికిప్పుడు తెలియడం లేదు. పాదాలు నేలకానుతున్నాయో లేదో అంతు పట్టడం లేదు. ఒకచోట కాలు జారింది. ముందుకు వాలిపోయి బుడుంగున నీళ్ళల్లో మునిగిపోవలసిందే! ఎలాగో నిభాయించుకున్నాడు

''మళ్ళి వచ్చేశావ్రటా?'' బిక్క చచ్చిపోతూ అడిగాడు వజీరు.

''ఈసారి పోతురాజుగారికిలే! శానియ్, సారా పట్టు...''

''పడతానుగానీ యిక మీదటిలా రావొద్దురా వెంకటేసూ! చూశావా, బాగా చీకటి పడిపోయింది. ఇదేం మజాకాగాదు. నీళ్ళతో పని. ఏం లోతుండదు లెమ్మని దిగి మహా మహా వాళ్ళెందరో ఏటిపాలై పోయినారు...''

''చాల్చాల్లే! చెప్పొచ్చావుగానీ నువ్వు నీ పనేమిటో చూడు వజీరన్నా! అట్లాగే ఓ సత్తులోటా నావైపుకి రానివ్వు...''

''మళ్ళీనా! ఒరేయ్ వెంకటేసూ, మళ్ళీనా?'' దిగాలుపడిపోతూ అడిగాడు వజీరు.

''నిండా మునిగాక చలేముంటుందిలే వజీరన్నా! ఇంకా మాటాడితే ఈ పెద్ద సీసా ఖాళీ చేసెయ్యమన్నా చేసేస్తాను...''

వెంకటేసు నిజంగా ఒంటిపైన స్మారకంతోనే యిలా మాటాడుతూ వుండొచ్చునను కున్నాడు వజీరు. లేకుంటే యింకొక సత్తు లోటా అతడికందించేవాడు కాదు.

అమాంతంగా తనకేదో మహదానంద లోకాల పౌరసత్వం లభించినట్లు వూగిపోతూ తూగిపోతూ వెంకటేసు ఏటిదగ్గరకు వచ్చాడు. వట్టిరోడ్డు పైన నడవడానికీ, పొంగులో వున్న ఏటిని దాటడానికీ వారా ఏమిటో తెలియని స్థితిలో నీటిలోకి దిగేశాడు. చిక్కబడిపోతున్న చీకటిలో ఓ ఆకారం ఏటి కడుపు దరిదాపుల్లో మసలడం ఊరివైపు ఒడ్డున నిల్చున్న వాళ్లు చూడగలిగారు. ఉన్నట్టుండి అది నీటి మట్టం క్రింద మటుమాయంగావడం గమనించినవాళ్ళు 'ఏమైంది, ఏమైంది.' అన్నట్టుగా ఒకరివైపొకరు చూసుకున్నారు. 'మనిషికాదే మోలే: మొగిలితుండై వుంటుంది,' అనుకున్నారు.

మెల్లగా విచ్చుకున్న కనురెప్పలయెదుట మొట్టమొదట నీలిడేరా లాంటి ఆకాశం కనిపించింది. ఆకాశపు డేరాను లాగి పట్టుకున్నట్టుగా చుట్టూరా కొండలున్నాయి కొండలకీవల కొబ్బరి చెట్లు, మామిడి తోపులు, పంట పొలాలు...

నిగ నిగలాడుతూ నీరెండ...

నీరెండలో తుమ్మెద లెగురుతున్నాయి. తంగేడు చెట్ల పైన సీతాకోకచిలుకలు విహరిస్తున్నాయి. గంగరావి చెట్టు కొమ్మ పైన పిచ్చుక గువ్వలు కువకువలాడుతున్నాయి.

ఊరి ముందర పోరంబోకు గొదుపుల్లో లేగ దూడలు చిందులు ద్రొక్కుతూ పరుగిడుతున్నాయి.

ప్రక్కలకు ఒత్తిగిల్లి వెంకటేసు పందిరి గుంజవైపు చూశాడు దుఃఖం గూడు గట్టినట్టుగా గుంజకు చేరగిలబడి తనవైపే చూస్తూ కన్నుగుడ్ల నిండుగా నీరు నించుకున్న బాలింతరాలు ముత్యాలు...

ఏమైందన్నట్టుగా చూపులతోనే ప్రశ్నించాడు.

ముత్యాలు రక రకాలుగా వివరించి చెప్పిన మీదట తెలియవచ్చిన సారాంశం యిది. రోడ్డు కొక ఫర్లాంగు దూరాన ఏటి వాలు కడ్డంగా పెద్ద పెద్ద నల్లటి గుండ్లున్నాయి. అక్కడ గుండ్లకు తగిలి ఏరు మెలి తిరుగుతుంది. తన శరీరమెలాగో ఆ మెలిక దగ్గర ఓ గుండుకు చేరవగా కొట్టుకొచ్చింది. సమయాని కక్కడొక గుండు పైన నిలబడి ప్రవాహం కేసి చూస్తున్న వాళ్ళెవరో తనను ఈవలికి లాగి యింటికి చేరవేశారు.

బోరిగిల పడుకోబెట్టి త్రాగిన నీళ్ళన్నీ కక్కించడమైతే జరిగింది గానీ శరీరంలో వూపిరున్నదీ, లేనిదీ ఒకపట్టాన తెలిసిందిగాదు

వెంకటేసు నీరసంతో కళ్ళు మూసుకున్నాడు. కళ్ళు తెరుచుకోడానికి మూసుకోడానికీ వున్న తేడా ఏమిటో గమనించి చూచుకున్నాడు. ఇప్పుడాకాశం లేదు. కొండలు లేవు. తోటలూ, పొలాలూ లేవు. పిట్టలూ లేవు, మనుషులూ లేరు. ఒకటుంటే గదా యింకొకటి లేదనుకోడానికి ? ఇప్పుడేదీ లేదు. లేదంటే ఆలోచించుకోడానికి బుద్ధంటూ ఒకటుంది. ఇందాక కళ్ళు తెరిచి చూడక మునుపు అదీ లేదు బహుశా చావంటే అలాగే వుంటుందేమో !

తన సత్తువ తనకొచ్చి లేచి తిరుగుతూ అతడు మళ్ళీ మనుషుల్లో పడడానికొక వారం రోజులు పట్టింది.

కాలికి బలపం కట్టుకున్నట్టుగా ఒక్కొక్కరినీ వెదుక్కుంటూ అతడు వూరి పైకి బయల్దేరాడు.

ఏనుగుపాడి సుబ్బన్నను చూచాడు. చేమంతుల శివయ్యను కలుసుకున్నాడు. మద్దింటి వీరా రెడ్డిని దర్శించాడు. నూరు బావుల పోతరాజుతో చెప్పిచూచాడు. ఇంకా నాగప్పగారి అబ్బాయి భూషణం, రామునాయుడిగారి రెండో కొడుకు శ్రీనివాసులు, బంగారక్క మనమడు చిట్టిబాబు, సీతంరాజు గారి దత్తు కొడుకు రాఘవులు – యిలా ప్రతి ఒక్కరి దగ్గరికి వెళ్ళి ప్రాధేయపడ్డాడు.

''బాబూ ! నేను చిన్నోణ్ణి. చదువుకోని వాణ్ణి. కట్టెలమ్ముకుని బతికేవాణ్ణి. వీడు చెప్పేదేమిటి, మనం వినేదేమిటని అనుకోవద్దు మంచి మాటకేముంది ? ఎవరైనా చెప్పొచ్చు. లోకంలో జల్మమంటూ ఎత్తాక మనం తినకుండా తాగకుండా బతకలేము. ఏదైనా ఒకటి తినాలిగదా అని మనం విషముష్టికాయ తింటామా ? గన్నేరు వేళ్ళు తింటామా ? డబ్బిచ్చి ఓ ఏలకాయంత పాషాణం తెచ్చి యింట్లో పెట్టుకుని రోజూ ఓ గురుగింజంత తింటూ కూచుంటామా ? అట్లాగే తాగాలని అనిపించినప్పుడు పళ్ళ రసం తాగొచ్చు. పాలు తాగొచ్చు. పానకం తాగొచ్చు పాయసం వండించుకుని తాగొచ్చు అంతేగాని...''

అంతకు మించి వెంకటేసు హితవును వినిపించుకున్న వాళ్ళు లేరు. కొందరు నవ్వారు. కొందరు చీదరించుకున్నారు. కొందరు దులపరించుకుని దూరంగా వెళ్ళమన్నారు. మొత్తం మీద అందరూ యిలాంటి కబుర్లు చెప్పడం కోసం యింకెప్పుడూ దగ్గరికి రావొద్దని తీవ్రంగా మందలించారు.

దిగులు దిగులుగా యింటికొస్తాడు వెంకటేసు ''ఏం చేద్దాం ముత్యాలూ ! వాళ్ళంతట వాళ్ళకున్నా తెలిసిరాదు. ఇంకొకరు చెప్పినా వినిపించుకోరు. ఇక చెప్పడానికి, చెయ్యడానికి ఏముంది? వాళ్ళ పెళ్ళాల తాళిబొట్లే వాళ్ళని కాపాడాల'' అంటూ నిట్టూరుస్తాడు. *